దర్శక దిగ్గజం శ్యామ్ బెనెగల్ ఇకలేరు

- కిడ్నీ సంబంధిత వ్యాధితో ముంబైలో తుదిశ్వాస
- హైదరాబాద్‌లో జననం
- భారతీయ సినిమాకు ప్రపంచ ఖ్యాతి తీసుకొచ్చిన దర్శకుడు
- పద్మభూషణ్, ఫాల్కే అవార్డులతో గౌరవించిన కేంద్రప్రభుత్వం
- తెలుగు చిత్రం అనుగ్రహంకు దర్శకత్వం

ముంబై/హైదరాబాద్ సిటీ బ్యూరో, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): ప్రముఖ సినీ దర్శకుడు శ్యామ్ బెనెగల్ సోమవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న 90 సంవత్సరాల శ్యామ్ బెనెగల్ సోమవారం సాయంత్రం ముంబైలోని వోక్‌హార్డ్ దవాఖానలో తుది శ్వాస విడిచినట్టు ఆయన కుమార్తె పియా బెనెగల్ ధ్రువీకరించారు. ఆయనకు భార్య నీనా బెనెగల్, కుమార్తె ఉన్నారు. అంకుర్, భూమిక, జునూన్, కలియుగ్, ఆరోహన్, త్రికాల్, సుస్మాన్, అంతర్‌నాద్, మండి, మంథన్ తదితర అనేక అవార్డు చిత్రాలకు శ్యామ్ బెనెగల్ దర్శకత్వం వహించారు. 1978లో వాణిశ్రీ, అనంతనాగ్‌లతో ఆయన తీసిన ఏకైక తెలుగు చిత్రం అనుగ్రహం 1979 బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు నోచుకుని విమర్శకుల ప్రశంసలు అందుకుంది. డిసెంబర్ 14న ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులతో కలసి తన 90వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. 1976లో పద్మశ్రీ అవార్డు, 1991లో పద్మ భూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. ఆయన దర్శకత్వం వహించిన విజయవంతమైన చిత్రాలలో మంథన్, జుబేదా, సర్దారీ బేగం కూడా ఉన్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ రచించిన డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆధారంగా దూరదర్శన్ కోసం ఆయన రూపొందించిన భారత్ ఏక్ ఖోజ్ డాక్యుమెంటరీ దేశవ్యాప్తంగా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. 1934 డిసెంబర్ 14న హైదరాబాద్‌లో జన్మించిన శ్యామ్ బెనెగల్ కొంకణీ మాట్లాడే చిత్రపూర్ సారస్వత్ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. కర్ణాటకకు చెందిన శ్యామ్ బెనెగల్ తండ్రి శ్రీధర్ బీ బెనెగల్ ఫొటోగ్రాఫర్ కావడంతో కెమెరా పట్ల శ్యామ్‌కు చిన్నప్పటి నుంచే ఆసక్తి ఏర్పడింది. తన 12వ ఏట తన తండ్రి బహుమతిగా ఇచ్చిన కెమెరాతో శ్యామ్ బెనెగల్ తన మొదటి చిత్రాన్ని తీశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందిన ఆయన హైదరాబాద్ ఫిల్మ్ సొసైటీని స్థాపించి తన సినీ ప్రయాణానికి బాటలు వేసుకున్నారు. ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలలో అంకుర్, మంథన్, మండి, నేతాజీ సుభాష్ చంద్ర బోస్: ది ఫర్‌గాటెన్ హీరో, జుబేదా, వల్ డన్ అబ్బా వంటివి అంతర్జాతీయంగా పేరు గడించాయి. ఆయన దర్శకత్వం వహించిన అనేక చిత్రాలు జాతీయ అవార్డులను గెలుచుకున్నాయి. తన 90వ జన్మదినానికి ముందు బెనెగల్ మాట్లాడుతూ తాను మూడు, నాలుగు ప్రాజెక్టులపై చర్చలు జరుపుతున్నానని చెప్పడం విశేషం.

భావితరాలకు స్ఫూర్తి

'దిగ్గజ దర్శకుడు, తెలంగాణ మట్టిబిడ్డ శ్యామ్ బెనగాల్ మృతి తీవ్రంగా బాధించింది. దాదాసా హేబ్ ఫాల్కే, పద్మభూషణ్ అవార్డులను అందుకున్న శ్యామ్ బెనెగల్.. తన మొదటి చిత్రం అంకుర్ ద్వారా తెలంగాణలోని భూస్వామ్య వ్యవస్థను కళ్లకు కట్టారు. భావితరాలకు ఆయన స్ఫూర్తి'

– కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రముఖుల నివాళులు

బెనెగల్ మృతిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, సినీ ప్రముఖులు శేఖర్ కపూర్, హన్సల్ మెహతా, మనోజ్ బాజ్‌పాయి, అక్షయ్ కుమార్, కాజోల్ సంతాపం వ్యక్తం చేశారు. అద్భుతమైన దర్శకులు, మేధావులలో ఒకరైన శ్యామ్ బెనెగల్ మృతి తనను తీవ్రంగా బాధించిందని ప్రముఖ తెలుగు నటుడు చిరంజీవి సంతాపం ప్రకటించారు.

'నో డిటెన్షన్' విధానం రద్దు

5, 8 తరగతులకు ఉత్తీర్ణత తప్పనిసరి

ఫెయిలైతే 2 నెలల్లో మరోసారి పరీక్షలు

- ఆ పరీక్షల్లో పాస్ అయితేనే పై తరగతులకు..
- లేదంటే, అదే తరగతి మళ్లీ చదవాల్సిందే
- కేంద్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- కేంద్రం పరిధిలోని 3 వేల స్కూల్స్‌లో అమల్లోకి
- ఇప్పటికే 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేసిన 16 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు
- తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న 'నో డిటెన్షన్'

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో 5, 8 తరగతుల వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు పై తరగతులకు ప్రమోట్ కారని, ఫెయిలైనట్లేనని వెల్లడించింది. ఈ మేరకు సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

నోటిఫికేషన్‌లో ఏమున్నదంటే?

- 5, 8 తరగతులు చదివే విద్యార్థులు పై తరగతులకు వెళ్లాలంటే ఏడాది చివర్లో నిర్వహించే వార్షిక పరీక్షల్లో ఇకపై తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిందే.
- ఒకవేళ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకపోతే.. ఫలితాలు ప్రకటించిన తేదీ నుంచి రెండు నెలల్లోపు ఫెయిలైన ఆయా విద్యార్థులకు తిరిగి పరీక్షలు నిర్వహిస్తారు.
- ఆ రీ-ఎగ్జామ్‌లో కూడా విద్యార్థి ఉత్తీర్ణత సాధించకపోతే, తిరిగి అదే తరగతిలో కొనసాగాల్సి ఉంటుంది.
- ఫెయిల్ కావడంతో తిరిగి అదే తరగతిని మళ్లీ చదువుతున్న విద్యార్థి పట్ల క్లాస్ టీచర్ ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. ఏయే పాఠ్యాంశాల్లో వెనుకబడి ఉన్నాడో గుర్తించి తగిన సాయం అందించాలి.
- ప్రాథమికోన్నత విద్య (ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) పూర్తయ్యేంత వరకూ ఏ విద్యార్థినీ ఏ స్కూల్ బహిష్కరించకూడదు.

ఏయే స్కూల్స్‌పై ప్రభావం?

'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించడంతో.. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని దాదాపు 3 వేల పాఠశాలల్లో తాజా నిబంధన అమల్లోకి రానున్నది. ఈ జాబితాలో కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ స్కూల్స్, సైనిక్ పాఠశాలలు కూడా ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వాల స్కూల్స్‌లో ఎలా?

పాఠశాల విద్య రాష్ట్ర జాబితాలోని అంశం గనుక 'నో-డిటెన్షన్' విధానం రద్దు విషయంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. హర్యానా, పుదుచ్చేరి ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. మిగతా రాష్ట్రాలు మాత్రం 'నో-డిటెన్షన్' విధానానికే మొగ్గు చూపుతున్నట్టు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో 'నో-డిటెన్షన్' విధానం కొనసాగుతున్నట్టు విద్యా నిపుణులు చెప్తున్నారు.

ఏమిటీ 'నో-డిటెన్షన్' విధానం?

విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ)-2009 ప్రకారం.. ఒకటి నుంచి 8వ తరగతి వరకూ ఏ విద్యార్థినీ ఫెయిల్ చేయకూడదు. వార్షిక పరీక్షల్లో విద్యార్థి అనుకొన్న ప్రతిభ సాధించనప్పటికీ, పై తరగతులకు ప్రమోట్ చేయాల్సిందే. దీన్నే 'నో-డిటెన్షన్' విధానంగా పిలుస్తారు. అయితే, 2019లో ఆర్టీఈలో చేసిన సవరణల్లో 'నో-డిటెన్షన్' విధానాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే, పాఠశాల విద్య రాష్ట్ర జాబితాలోని అంశం గనుక ఆయా రాష్ట్రప్రభుత్వాలు 'నో-డిటెన్షన్' విధానంపై నచ్చిన విధంగా ముందుకు వెళ్లొచ్చని సూచించారు.

గతంలో ఏ రాష్ట్రాలు రద్దు చేశాయంటే?

విద్యాహక్కుచట్టం-2019కు చేసిన సవరణల ప్రకారం.. దాదాపు 16 రాష్ట్రాలు, ఢిల్లీ సహా రెండు యూటీలు 5, 8వ తరగతులకు ఇప్పటికే 'నో-డిటెన్షన్' విధానాన్ని రద్దు చేశాయి. తాజాగా కేంద్రం కూడా ఈ విధానాన్ని రద్దు చేసింది.

'ఇండియా' పగ్గాలను వదిలేయడానికి కాంగ్రెస్ సిద్ధపడాలి

మణిశంకర్ అయ్యర్

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి సారథ్య బాధ్యతల నుంచి తప్పుకోవడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉండాలని సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ నేత పోషించే పాత్ర ఎల్లప్పుడూ విస్తృతంగా ఉండాలని చెప్పారు. అది ఒకే ఒకటిగా ఉండకూడదని, ఇండియా కూటమిలో ప్రధానమైనదిగా ఉండాలని తెలిపారు. ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏదైనా ఇతర పార్టీ ఇండియా కూటమికి నాయకత్వం వహించగలదా? అని ప్రశ్నించినపుడు అయ్యర్ స్పందిస్తూ.. కూటమి నాయకత్వాన్ని వదులుకునేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉండాలని చెప్పారు. కూటమిలో భాగస్వాములుగా ఉన్న మమతా బెనర్జీ, ఇతర నేతలకు సారథ్యం వహించే సామర్థ్యం ఉంది అని పేర్కొన్నారు.

పాప్‌కార్న్‌పై 'జీఎస్టీ' పరేషాన్

న్యూఢిల్లీ: పాప్‌కార్న్‌పై కేంద్రం నిర్ణయించిన కొత్త జీఎస్టీ రేట్లపై విమర్శలు, వెక్కిరింతలు వ్యక్తమవుతున్నాయి. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాప్‌కార్న్‌పై కొత్త జీఎస్టీ రేట్లను నిర్ణయించారు. ఉప్పు, కారం, మసాలాలు కలిపిన నాన్ బ్రాండెడ్ పాప్‌కార్న్‌పై 5%, బ్రాండెడ్, ప్రీ-ప్యాక్డ్ పాప్‌కార్న్‌పై 12% జీఎస్టీ విధించారు. కారామెల్ పాప్‌కార్న్‌ను చక్కెర కలిసిన మిఠాయిగా పేర్కొంటూ 18% జీఎస్టీ నిర్ణయించారు. సులభంగా ఉండాల్సిన ట్యాక్స్ రేట్లను సంక్లిష్టంగా మార్చడాన్ని ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్ మోహన్‌దాస్ పాయ్ తప్పుబట్టారు. ఈ సంక్లిష్ట విధానం ప్రజలకు ప్రాణసంకటంగా మారుతుందని మాజీ ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ విమర్శించారు. కొత్త జీఎస్టీ రేట్లను ఎద్దేవా చేస్తూ సోషల్ మీడియాలో మీమ్స్ వైరల్ అవుతున్నాయి. సాల్టెడ్ పాప్‌కార్న్‌కు 5%, కారామెల్ పాప్‌కార్న్‌కు 18% జీఎస్టీ అంటే రెండు కలిపిన వాటికి ఎంత జీఎస్టీ వర్తిస్తుందని ఓ నెటిజన్ ప్రశ్నించాడు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌గా రామసుబ్రమణియన్

సుప్రీంకోర్టు జడ్జిగా గతంలో సేవలు



న్యూఢిల్లీ, డిసెంబర్ 23: జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వీ రామసుబ్రమణియన్ సోమవారం నియమితులయ్యారు. ప్రభుత్వం లేదా ప్రభుత్వ ఉద్యోగి మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడితే విచారణ జరిపే అధికారం ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఉంది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా జూన్ 1న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఈ పదవి ఖాళీగా ఉంది. తాత్కాలిక చైర్‌పర్సన్‌గా ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యుడు విజయ భారతి సయాని కొనసాగుతున్నారు. ప్రధాని అధ్యక్షతన ఉండే ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) లేక సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్‌గా రాష్ట్రపతి నియమిస్తారు. డిసెంబర్ 18న ఈ కమిటీ సమావేశమైంది. కమిటీ సిఫారసు మేరకు జస్టిస్ రామసుబ్రమణియన్‌ను ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌గా రాష్ట్రపతి నియమించారు.

షేక్ హసీనాను అప్పగించండి

భారత్‌కు బంగ్లాదేశ్ దౌత్య లేఖ

ఢాకా: మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని కోరుతూ బంగ్లాదేశ్‌లోని ఆపద్ధర్మ ప్రభుత్వం భారత్‌కు దౌత్యపరమైన లేఖ పంపింది. విద్యార్థుల నిరసనలతో హసీనా ప్రభుత్వం కూలిపోగా, ఆగస్టు 5న షేక్ హసీనా ఢాకాను వదిలి ఢిల్లీకి చేరుకున్నారు. మారణకాండకు, ఊచకోతకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న షేక్ హసీనా, ఆమె మంత్రులు, సలహాదారులు, మాజీ సైనిక, ప్రభుత్వ అధికారులపై ఢాకాకు చెందిన అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్(ఐసీటీ) అరెస్టు వారెంట్లు జారీచేసింది. న్యాయ ప్రక్రియ కోసం హసీనాను వాపసు పంపాలని కోరుతూ భారత ప్రభుత్వానికి దౌత్య సందేశాన్ని పంపించినట్లు ఆపద్ధర్మ ప్రభుత్వంలో విదేశీ వ్యవహారాల సలహాదారు తౌహీద్ హుస్సేన్ విలేకరులకు తెలిపారు. హసీనా అప్పగింత కోసం చర్యలు తీసుకోవాలని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు లేఖ రాసినట్టు హోం వ్యవహారాల సలహాదారు జహంగీర్ ఆలం ఇదివరకు వెల్లడించారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉన్న నేరస్తుల అప్పగింత ఒప్పందం ప్రకారమే హసీనాను వెనక్కు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు.

30న పీఎస్‌ఎల్‌వీ-సీ60 ప్రయోగం

బెంగళూరు: సరికొత్త అంతరిక్ష ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. రెండు శాటిలైట్స్‌ను కక్ష్యలో ప్రవేశపెట్టడమేగాక, ఆ రెండింటినీ కలుపుతూ(డాకింగ్), విడగొడుతూ(అన్‌డాకింగ్) 'స్పేస్ డాకింగ్' అనే ప్రక్రియను ఇస్రో ప్రదర్శించబోతున్నది. ఇందుకోసం పీఎస్‌ఎల్‌వీ-సీ60 మిషన్‌ను ఈ నెల 30న ప్రయోగించనుంది. మానవ సహిత అంతరిక్ష యాత్రలు, భారతీయ అంతరిక్ష స్టేషన్(బీఏఎస్) నిర్మాణానికి కీలకమైన 'స్పేస్ డాకింగ్ టెక్నాలజీ'ని ఈ మిషన్ ద్వారా పరీక్షించనున్నారు.

ఖేద్కర్‌కు ముందస్తు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ: మాజీ ఐఏఎస్ ట్రైనీ అధికారిణి పూజా ఖేద్కర్‌కు ఢిల్లీ హైకోర్టు సోమవారం ముందస్తు బెయిల్ నిరాకరించింది. తప్పుడు ధ్రువపత్రాలతో ఐఏఎస్ పరీక్ష పాస్ అయ్యేందుకు ప్రయత్నించారని ఆమెపై ఈ ఏడాది జూన్, ఆగస్ట్‌లో అభియోగాలు నమోదయ్యాయి. ప్రాథమికంగా ఆమె ఉద్దేశం యూపీఎస్సీ అధికారులను మోసం చేయడమేనని.. ఇందుకు ఆమె వేసిన ఎత్తుగడలు పెద్ద కుట్రలో భాగమని కోర్టు పేర్కొంది. ఆమెపై నమోదైన ఫోర్జరీ, మోసం అభియోగాలు అధికారులనే కాకుండా దేశాన్ని మోసగించడంలోనూ చక్కని ఉదాహరణగా ఉపయోగపడతాయని కోర్టు వ్యాఖ్యానించింది.

ప్రభుత్వ పథకం కింద సన్నీ లియోనికి ప్రతి నెలా 1,000!

రాయ్‌పూర్: వివాహిత మహిళల కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రారంభించిన పథకం నుంచి బాలీవుడ్ ప్రముఖ నటి సన్నీలియోనీ లబ్ధిపొందుతున్నారు. నమ్మశక్యం కాకున్నా ఇది నిజం. అయితే, ఇక్కడో ట్విస్ట్ ఉంది. అక్కడి బీజేపీ ప్రభుత్వం 'మహతారి వందన్ యోజన' పేరుతో వివాహితులైన మహిళల కోసం ఓ పథకం ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రతినెల వారి ఖాతాలో నెలకు రూ. 1000 చొప్పున జమచేస్తున్నది. ఈ క్రమంలో బస్తర్ ప్రాంతంలోని తాలూర్ గ్రామానికి చెందిన వీరేంద్రజోషి.. సన్నీలియోని పేరిట ఆమె ఫొటో, పేరు, ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు గుడ్డిగా దానిని ఆమోదించారు. మనోడి పంట పండటంతో ప్రతినెల ఖాతాలో పడుతున్న రూ. 1000 తన జేబులో వేసుకుంటూ వస్తున్నాడు. తాజాగా విషయం వెలుగులోకి రావడంతో అతడిపై కేసు నమోదైంది. ఈ ఘటనపై కలెక్టర్ హరీశ్ విచారణకు ఆదేశించారు. ఆ బ్యాంక్ ఖాతాను సీజ్ చేశారు. ఈ ఘటన అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

కృత్రిమ గుండెతో సాధ్యమే!

- గుండె కండరాల కణాల పునరుత్పత్తి
- గుర్తించిన అమెరికా శాస్త్రవేత్తలు
- హార్ట్ ఫెయిల్యూర్ చికిత్సకు వీలు



న్యూయార్క్, డిసెంబర్ 23: గుండె కండరాల కణాలకు పునరుత్పత్తి సామర్థ్యం లేదని ఇంతకాలం భావిస్తున్న శాస్త్రవేత్తలు ఇప్పుడు కొత్త విషయాన్ని కనుగొన్నారు. కృత్రిమ గుండె ఉన్న వారిలో గుండె కండరాల కణాల పునరుత్పత్తి జరుగుతున్నదని గుర్తించారు. కృత్రిమ గుండె కలిగిన పేషెంట్ల కణజాల నమూనాలపై అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అరిజోనాలో ఉన్న సర్వర్ హార్ట్ సెంటర్‌కు చెందిన శాస్త్రవేత్తలు అధ్యయనం జరిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు 'సర్కులేషన్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. గుండెకు విశ్రాంతి అనేదే ఉండదు కాబట్టి జన్మించిన తర్వాత అది పునరుత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోతుందనేది శాస్త్రవేత్తల నమ్మకం. ఈ అధ్యయనం ఈ నమ్మకాన్ని బలపరిచింది. ఇదే సమయంలో కణాల పునరుత్పత్తికి కృత్రిమ గుండె ద్వారా అవకాశం ఉన్నట్టు గుర్తించింది. కృత్రిమ గుండె కలిగిన వారిలో దాదాపు 25 శాతం మందిలో గుండె కండరాల కణాల పునరుత్పత్తి జరుగుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. కృత్రిమ గుండె ద్వారా గుండె కండరాలకు ఒకరకమైన విశ్రాంతి లభిస్తుండటం వల్లే ఇది సాధ్యమవుతున్నట్టు భావిస్తున్నారు. మానవ గుండె కండరాల కణాలకు పునరుత్పత్తి సామర్థ్యం ఉందని చెప్పడానికి ఈ అధ్యయనం బలమైన సాక్ష్యమని సర్వర్ హార్ట్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ హెషమ్ సడెక్ తెలిపారు.

హార్ట్ ఫెయిల్యూర్ చికిత్సకు అవకాశం

ఏటా కోట్లాది మంది మరణాలకు కారణమవుతున్న గుండె వైఫల్యానికి చికిత్స అందించేందుకు శాస్త్రవేత్తలకు ఈ అధ్యయనం ద్వారా సరికొత్త మార్గం కనిపిస్తున్నది. రీజనరేటివ్ మెడిసిన్‌కు కృత్రిమ హృదయాలు దోహదపడవచ్చని, గుండెకు స్వతాహాగా ఉండే నయం చేసుకునే సామర్థ్యాలను అర్థం చేసుకునేందుకు ఈ అధ్యయనం అవకాశం కల్పించిందని అభిప్రాయపడుతున్నారు.

సివిల్ సర్వీసుల్లో సగం మంది జనరల్ క్యాటగిరీనే

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: దేశంలో ఐఏఎస్, ఐపీఎస్‌లుగా నియమితులవుతున్న వారిలో దాదాపు సగం మంది జనరల్ క్యాటగిరీ నుంచే ఉంటున్నారు. మిగతా సగం మంది ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు. 2018 నుంచి 2022 మధ్యకాలంలో ఐఏఎస్, ఐపీఎస్ అయినవారిలో జనరల్ క్యాటగిరి నుంచి 46.5 శాతం ఉండగా, ఓబీసీకి చెందిన వారు 29.4 శాతం, షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు 16.33 శాతం, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు 7.83 శాతం మంది ఉన్నారు. డీఎంకే ఎంపీ పీ విల్సన్ ప్రశ్నకు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఈ వివరాలను రాతపూర్వకంగా పార్లమెంటుకు వెల్లడించారు.

టీ, కాఫీతో క్యాన్సర్ నుంచి రక్షణ

తల, మెడ, గొంతు, నోటి క్యాన్సర్ ముప్పు తగ్గుదల

న్యూఢిల్లీ: టీ, కాఫీ సేవనం వల్ల తల, మెడ, గొంతు, నోటి క్యాన్సర్ ముప్పు తగ్గుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా తల, మెడ క్యాన్సర్ ఏడో అతి సాధారణ క్యాన్సర్. అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో ఈ క్యాన్సర్ రేట్లు పెరుగుతున్నాయి. కాఫీని సేవించని వారితో పోల్చినపుడు, రోజుకు నాలుగు కప్పుల కన్నా ఎక్కువ కెఫినేటెడ్ కాఫీని తాగేవారికి తల, మెడ క్యాన్సర్ ముప్పు 17 శాతం తక్కువగా ఉంటుందని అధ్యయనం తెలిపింది. నోరు, నాలుక వంటి భాగాలకు క్యాన్సర్ ముప్పు 30%, గొంతు క్యాన్సర్ ముప్పు 22 శాతం తగ్గుతుందని, గొంతు క్రింది భాగంలో క్యాన్సర్ వచ్చే అవకాశం 41 శాతం తగ్గుతుందని వెల్లడించింది. డీకెఫినేటెడ్ కాఫీ కూడా కొంత వరకు సానుకూల ప్రభావం చూపుతుందని గుర్తించింది. టీ తాగడం వల్ల గొంతు కింది భాగంలో క్యాన్సర్ ప్రమాదం 29 శాతం తగ్గుతుంది. రోజూ ఒక కప్పు లేదా అంతకన్నా తక్కువ టీ తాగడం వల్ల తల, మెడ క్యాన్సర్ ముప్పు 9 శాతం వరకు తగ్గుతుంది. గొంతు కింది భాగంలో క్యాన్సర్ ముప్పు 27 శాతం వరకు తగ్గుతుంది. అయితే రోజుకు ఒకటి కన్నా ఎక్కువ కప్పుల టీ తాగితే, స్వరపేటిక క్యాన్సర్ ముప్పు 38 శాతం ఎక్కువగా ఉంటుంది.

గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ కన్ను!

- అమెరికా కొంటుందని వ్యాఖ్య
- పనామా కాలువను స్వాధీనం చేసుకుంటామని ఇదివరకే వెల్లడి
- తాము అమ్మకానికి లేమన్న గ్రీన్‌లాండ్ ప్రధాని ఎగెడే

వాషింగ్టన్: అమెరికాను మళ్లీ ఉన్నతంగా తీర్చిదిద్దుతానని ఎన్నికల్లో గెలిచిన డొనాల్డ్ ట్రంప్ ప్రతి రోజు ఒక్కొక్క దేశానికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తాజాగా ఆయన దృష్టి డెన్మార్క్‌లో భాగమైన గ్రీన్‌లాండ్‌పై పడింది. ఇది 600కు పైగా సంవత్సరాలుగా డెన్మార్క్‌లో భాగంగా ఉంది. ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ.. దేశ భద్రత, ప్రపంచ స్వేచ్ఛ కోసం గ్రీన్‌లాండ్‌పై యాజమాన్యం, నియంత్రణ కచ్చితంగా ఉండాలని అమెరికా భావిస్తున్నదని పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్‌పై నియంత్రణ కావాలనే కోరికను ఆయన తన మొదటి అధ్యక్ష పదవీ కాలంలోనే వ్యక్తం చేశారు.

ఘాటుగా స్పందించిన గ్రీన్‌లాండ్ పీఎం

ట్రంప్ హెచ్చరికపై గ్రీన్‌లాండ్ ప్రధాన మంత్రి ముటే ఎగెడే ఘాటుగా స్పందించారు. ''మేం ఎన్నటికీ అమ్మకానికి ఉండబోము. స్వాతంత్ర్యం కోసం మా సుదీర్ఘ యుద్ధాన్ని ఓడిపోబోం'' అని తెలిపారు.

పనామా ప్రెసిడెంట్ ఘాటు జవాబు

పనామా కాలువ గుండా వెళ్తున్న అమెరికా నౌకలకు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని, దానిని తిరిగి తమకు అప్పగించాలని ట్రంప్ చేసిన హెచ్చరికలపై పనామా ప్రెసిడెంట్ జోస్ రౌల్ ములినో ఘాటుగా స్పందించారు. పనామా కాలువలో ప్రతి చదరపు మీటరు పనామాకే చెందుతుందని స్పష్టం చేశారు. ట్రంప్ వ్యాఖ్యలు తమ సార్వభౌమాధికారాన్ని కించపరచడమేనని మండిపడ్డారు.

ఏఐ అడ్వైజర్‌గా శ్రీరామ్ కృష్ణన్

ఇండియన్ అమెరికన్‌కు ట్రంప్ కీలక పదవి

సాన్ ఫ్రాన్సిస్కో: కృత్రిమ మేధ(ఏఐ)పై సీనియర్ వైట్‌హౌస్ పాలసీ సలహాదారుగా ఇండియన్ అమెరికన్ శ్రీరామ్ కృష్ణన్‌ను అమెరికా ఎన్నికైన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం నియమించారు. కృష్ణన్ గతంలో మైక్రోసాఫ్ట్, ట్విట్టర్, యాహూ, ఫేస్‌బుక్, స్నాప్ కంపెనీల్లో పని చేశారు. వైట్‌హౌస్‌లో ఆయన డేవిడ్ ఓ.సాక్స్‌తో కలిసి పనిచేస్తారని ట్రంప్ తెలిపారు. దీనిపై కృష్ణన్ స్పందిస్తూ.. 'ఏఐపై డేవిడ్ సాక్స్‌తో కలిసి పనిచేస్తూ మన దేశానికి సేవ చేయగలగడాన్ని గౌరవంగా భావిస్తున్నా' అని అన్నారు. కృష్ణన్ నియామకంపై భారతీయ అమెరికన్ సమాజం హర్షం వ్యక్తం చేసింది.

'సముద్రయాన్'కు సిద్ధం

వచ్చే వారమే మత్స్య 6000 హార్బర్ టెస్ట్ • విజయవంతమైతే 2026లో అసలు ప్రయోగం • సముద్రగర్భ అన్వేషణకు ముగ్గురితో బృందం

చెన్నై, డిసెంబర్ 23: అంతుచిక్కని రహస్యాలకు, అబ్బురపరిచే ఖనిజ సంపదకు నెలవు సముద్రం. ఎక్కడో దూరాన ఉన్న చంద్రుడి, అంగారకుడి గుట్టును సైతం కనిపెడుతున్న మాడ్రన్ సైన్స్.. మన భూమిపైనే ఉన్న సముద్రుడి సంగతులను మాత్రం పూర్తిగా పసిగట్టలేకపోతున్నది. సముద్ర అన్వేషణకు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనల్లో భారత్ సైతం ముందంజలో ఉంది. ఈ దిశగా 'సముద్రయాన్' మిషన్‌కు సిద్ధమవుతున్నది. 2026లో అంతరిక్షానికి మనుషులను పంపాలనే లక్ష్యంతో చేపడుతున్న గగన్‌యాన్‌తో పాటు సముద్రయాన్ మిషన్‌ను సైతం భారత్ చేపట్టనుంది. ఇందుకోసం ఇప్పటికే చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషియన్ టెక్నాలజీ(ఎన్ఐఓటీ) మత్స్య 6000 పేరుతో ఒక సబ్‌మెర్సిబుల్‌ను తయారు చేసింది. వచ్చే వారమే దీనిని మొదటిసారిగా హార్బర్ టెస్ట్ చేయనున్నారు.

సముద్రయాన్ లక్ష్యమేంటి?

సముద్రగర్భంలో దాగి ఉన్న ఖనిజాలను అన్వేషించడానికి, సముద్రాన్ని మరింత లోతుగా అధ్యయనం చేయడానికి సముద్రయాన్ ప్రయోగాన్ని చేపడుతున్నారు. ఈ మిషన్‌కు మొత్తం రూ.4,077 కోట్లు ఖర్చు చేస్తున్నారు. పాలిమెటాలిక్ నొడ్యూల్స్(పీఎంఎన్) అన్వేషణకు మధ్య హిందూ సముద్ర ప్రాంతాన్ని ఇప్పటికే ఇంటర్నేషనల్ సీబెడ్ అథారిటీ భారత్‌కు అప్పగించింది. భారత్‌కు కేటాయించిన సముద్రగర్భంలో దాదాపు 75 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో నికెల్, రాగి, మాంగనీస్, కోబాల్ట్ వంటి ఖనిజాలతో కూడిన పీఎంఎన్‌లు విస్తరించి ఉన్నాయి. ఒక పైలట్, ఒక కోపైలట్, మరో పరిశోధకుడు ఈ సబ్‌మెర్సిబుల్‌లో సముద్రగర్భంలోకి వెళ్లనున్నారు. 12 గంటల పాటు ఈ ప్రయోగం కొనసాగనుంది. అత్యవసర పరిస్థితుల్లో 96 గంటల వరకు పొడిగించవచ్చు. 7,517 కిలోమీటర్ల పొడవైన తీర ప్రాంతం ఉన్న భారత్‌కు ఈ ప్రయోగం చాలా కీలకంగా మారింది.

మత్స్య 6000 ప్రత్యేకతలు

సముద్రయాన్ కోసం మొదట విదేశాల నుంచి సబ్ మెర్సిబుల్‌ను కొనుగోలు చేయాలని ఎన్ఐఓటీ అనుకొని టెండర్లు పిలిచింది. అయితే, ఇది ఆర్థికంగా భారం కావడంతో పాటు ఈ ప్రయోగం కోసం విదేశాలపై ఆధారపడాల్సి వస్తుందనే కారణంతో దేశీయ సాంకేతికతతో మత్స్య 6000ను సొంతంగా అభివృద్ధి చేసింది. ఇది నాలుగో తరం సబ్‌మెర్సిబుల్ అని ప్రాజెక్ట్ డైరెక్టర్ వేదాచలం తెలిపారు. 28 టన్నుల బరువుండే ఈ సబ్‌మెర్సిబుల్‌కు రెండు రోబోటిక్ చేతులు ఉంటాయి. ఇవి సముద్రగర్భం నుంచి ఖనిజ నమూనాలను సేకరిస్తాయి. ఇందులో ప్రపంచంలోనే మొదటిసారిగా లీథియం పాలిమర్ బ్యాటరీలను వాడుతున్నారు. మదర్ షిప్ నుంచి దీనిని నియంత్రిస్తారు. ఒకవేళ నియంత్రణ కోల్పోయినా అత్యవసర పరిస్థితుల్లో ఇందులోని సిబ్బందిని రక్షించడానికి మూడు ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించారు. 6000 అడుగుల లోతులో మానవ శరీరంపై భూఉపరితలంతో పోలిస్తే 600 రెట్లు అధికంగా నీటి ఒత్తిడి ఉంటుంది. దీనికి తగ్గట్టుగా ధృఢంగా మత్స్య 6000ను తయారుచేశారు.



హార్బర్ టెస్ట్ అంటే?

సబ్ మెర్సిబుల్‌ను ప్రొపెల్లర్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇలా వివిధ భాగాలుగా వేర్వేరుగా తయారుచేశారు. ఇప్పుడు వీటిని జతపరిచి మొదటి దశలో భాగంగా హార్బర్ టెస్ట్ చేయనున్నారు. ఇందులో ముగ్గురిని బంగాళాఖాతంలో 15 మీటర్ల లోతుకు పంపిస్తారు. ఈ పరీక్ష సజావుగా సాగితే వచ్చే ఏడాది 100 మీటర్లు, 200 మీటర్లు, 500 మీటర్ల లోతుకు పంపించే పరీక్షలు జరుపుతారు. అన్ని పరీక్షలు విజయవంతంగా పూర్తయితే మధ్య హిందూ సముద్రంలో 2026 చివరన సముద్రయాన్ అసలు ప్రయోగం ఉంటుంది. వాస్తవానికి హార్బర్ టెస్టు డిసెంబర్ మధ్యలోనే పూర్తి కావాల్సిన ఉన్నా.. ఫెంగల్ తుఫాను వల్ల ఆలస్యమైంది.